సాక్షి జనగామ

ఆదివారం । 28 । మే । 2023



వల్మిడికి విదేశీ వాణిజ్యం..

వల్మిడికి రెండు దశాబ్దాల క్రితమే విదేశీ వాణిజ్య సంబంధాలున్నాయని చరిత్ర పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. - 8లో▸



వర్సిటీల పాత్ర కీలకం

ఉన్నత విద్యలో విస్తృత మార్పులు రాబోతున్న నేపథ్యంలో వర్సిటీల పాత్ర కీలకం కానుందని న్యాక్ పీర్ టీం చైర్మన్ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$41^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వేడి గాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



జనగామ: గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలను అందించాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'లక్ష్య' సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో ఎంసీహెచ్‌కు రాష్ట్రంలో మొదటి స్థానం దక్కినందుకు.. శనివారం కలెక్టర్ కార్యాలయంలో మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజుతోపాటు వైద్యులు, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా 'లక్ష్య'తోపాటు ఇంతకు ముందు వచ్చిన ముస్కాన్ సర్టిఫికెట్లను సూపరింటెండెంట్‌కు అందజేశారు.

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేడుకను తిలకించడానికి తరలివచ్చిన భక్తులకు కల్యాణం అనంతరం రఘునాథపల్లికి చెందిన సముద్రాల వెంకటనర్సింహారావు జానకి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీధర్‌రావు, ఎస్‌ఐ వినయ్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



పాలకుర్తి టౌన్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ అజ్మీరా పరశురాం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీం, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, రికార్డులు, నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని, షాపుల వద్ద స్టాక్, ధరలతో కూడిన పట్టికలు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన రైతులకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి పెద్దిరెడ్డి వరలక్ష్మి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వడగళ్లతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



జనగామ రూరల్: వడగళ్లతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి వెంటనే ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. శనివారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిడి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన రైతుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వడగళ్ల వానకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ నేటికీ విడుదల చేయలేదన్నారు. తక్షణమే పరిహారం అందజేసి రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం అమలు చేస్తున్న ఫసల్ బీమాను రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు కేవీఎల్‌ఎన్.రెడ్డి, శివరాజ్, రమేష్, భాస్కర్‌రెడ్డి, బీరప్ప, నారాయణ పాల్గొన్నారు.

అలరించిన నృత్య పోటీలు

హన్మకొండ: హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన నృత్య పోటీలు శనివారం ముగిశాయి. మెగా కోమల ఏరోబిక్స్, డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో ఇండియా లెవల్ నృత్య పోటీలు జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా శరత్‌రెడ్డి, రేణుక వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కళాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఎనిమిదేళ్లుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గాదె క్రాంతికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, చింటు, ప్రణయ్, సాయి, శ్యాం, బాలు తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ మీట్‌కు 109 మంది

- ముగిసిన సీఎం కప్ మండల, జిల్లాస్థాయి క్రీడా పోటీలు
- గ్రామీణ ప్రాంతాల్లో అనూహ్య స్పందన
- నేటి నుంచి హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు షురూ..
- ఇక్కడి నుంచి ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన క్రీడాకారులు



సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వివిధ విభాగాల క్రీడాకారులు

జనగామ: గ్రామీణ ప్రాంతంలోని 15 నుంచి 36 ఏళ్ల లోపు యువతీ యువకులు, మహిళలు, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల, జిల్లా స్థాయి సీఎం కప్–2023 వారియర్స్ క్రీడా పోటీలు ముగిసాయి. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన 109 మంది క్రీడాకారులు ఆదివారం(నేడు) నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే స్టేట్ మీట్‌లో పాల్గొననున్నారు.

అనూహ్య స్పందన

జిల్లాలో ఈనెల 15 నుంచి కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య నేతృత్వంలో అధికారులు సమన్వయంతో నిర్వహించిన సీఎం కప్ పోటీలకు స్పందన లభించింది. పోటీల ప్రారంభానికి ఇరవై రోజుల ముందు నుంచే పక్కా ప్రణాళిక తయారు చేసుకుని ఊరూరా ప్రచారం చేపట్టి ఆసక్తి కలిగిన క్రీడాకారులకు ఆహ్వానం పలికారు. గ్రామీణ ప్రాంతాల నుంచి అనూహ్య స్పందప వచ్చింది. అందుకు తగినట్లుగా మండల, జిల్లా స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, కలెక్టర్, ఇతర ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు.

మండల స్థాయిలో మూడు రోజులు..

ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయిలో ఐదు కేటగిరీల్లో మహిళలు, పురుషుల విభాగంలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో 1,899 మంది పాల్గొనగా జిల్లా స్థాయికి 716 మంది అర్హత సాధించారు.

రాష్ట్ర స్థాయికి 109 మంది ఎంపిక..

జిల్లా స్థాయిలో మహిళలు, పురుషుల విభాగంలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెస్లింగ్ పోటీలు ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చి 109 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియం, సరూర్‌నగర్ స్టేడియం, జింఖానా గ్రౌండ్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, యూసుఫ్‌గూడ, గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు కొనసాగుతాయి. జిల్లా నుంచి అర్హత సాధించిన కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఖోఖో, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ విభాగాల క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌కు రెండు ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు. వారికి జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో ప్రత్యేక పాస్‌లు అందజేశారు.

రాష్ట్ర స్థాయిలో రాణించాలి



జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలి. మండల, జిల్లా స్థాయిలో చాలామంది క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉండి, వెలుగులోకి రాని క్రీడాకారులకు సీఎం కప్ వారియర్స్ పోటీలు చక్కగా ఉపయోగపడ్డాయి. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుంది.

– సీహెచ్.శివలింగయ్య, కలెక్టర్

వైద్య కళాశాల పనులు వేగవంతం చేయాలి

- వీసీలో మెడికల్ అండ్ హెల్త్ సెక్రటరీ రిజ్వీ, డైరెక్టర్ రమేష్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

జనగామ రూరల్: జిల్లాలో జరుగుతున్న నూతన వైద్య కళాశాల నిర్మాణ, మౌలిక వసతుల కల్పన పనులు వేగవంతం చేయాలని మెడికల్ అండ్ హెల్త్ సెక్రటరీ రిజ్వీ, డైరెక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం జిల్లాలో మెడికల్ కళాశాలల తరగతులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇప్పటికే సూచించిన నిర్మాణాలు, వసతుల కల్పన పనులను మెడికల్ ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి పూర్తి చేయాలని సూచించారు. సమస్యలు ఉంటే కలెక్టర్లకు తెలిపి పరిష్కరించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ.. ఇప్పటికే తాత్కాలిక వసతి కల్పనకు హాస్టల్ తరగతి గదులు, ల్యాబ్ నిర్వహణకు పట్టణంలోని ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు చేశామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు, వైద్యాధికారి ప్రశాంత్, ప్రోగాం ఆఫీసర్ రవీందర్, డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సాగుభూములు ఆక్రమిస్తే చర్యలు

- జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి

బచ్చన్నపేట: ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను అక్రమంగా ఆక్రమిస్తే చర్యలు తప్పవని జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి గోపాల్‌నగర్ గ్రామం 174 సర్వే నంబర్‌లో అక్రమంగా గుడిసెలు వేసిన వారిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు విచారించడానికి శనివారం ఆయన ఇక్కడికి వచ్చారు. గుడిసెలు వేసిన వారిని, వారికి సహకరించిన సీపీఎం నాయకులను, భూకబ్జాదారులను విడివిడిగా విచారించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ అక్రమంగా గుడిసెలు వేయడంతోపాటు అసభ్య పదజాలంతో దూషించిన 30 మందిపై బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి కేసులను నమోదు చేసినట్లు చెప్పారు. భూమి సాగుచేసుకుంటున్న వారికే హక్కులు ఉంటాయని, అక్రమంగా చొరబడితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భూమి కోర్టు వివాదంలో ఉన్నందున తీర్పు వచ్చిన తర్వాత అందుకు అనుగుణంగా మెదలాలని సూచించారు. కార్యక్రమంలో నర్మెట సీఐ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి లంచం డిమాండ్

- జేఏసీ ఆధ్వర్యంలో నిరసన, ఫిర్యాదు



నిరసన తెలుపుతున్న బాధితుడు, జేఏసీ నాయకులు

జనగామ: పట్టణంలో ఇంటి నిర్మాణానికి అధికారి లంచం డిమాండ్ చేస్తూ.. ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అతడిని సస్పెండ్ చేయాలని కోరుతూ బాధితుడు జిల్లా జేఏసీతో కలిసి శనివారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టిన అనంతరం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళ్లపల్లి రాజు, బాధిత యువకుడు బానోతు మల్లేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని లక్ష్మీబాయ్‌కుంటలో మల్లేష్ తన 150 గజాల స్థలంలో ఇంటి నిర్మాణానికి టీఎస్ బీ పాస్ లో రూ.44వేలు చలాన్ కట్టి నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్నాడు. ఆ ఫైల్ కలెక్టరేట్‌లో పని చేసే అనుమతుల విభాగం అధికారి నరేష్ వద్దకు వెళ్లింది. అనుమతి కోసం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా నిరాకరించడంతో అధికారి నరేష్ ప్లాట్ అనుమతి తిరస్కరించినట్లు మల్లేష్ వాపోయాడు. దీంతో న్యాయం కోసం బాధితుడు జిల్లా జేఏసీని ఆశ్రయించగా.. వారి ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు మల్లేష్ తెలిపాడు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు గన్ను కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ కౌశిక్, నల్ల మహేష్, వెంపటి అజయ్, మద్దెల కార్తీక్, అప్పు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సమృద్ధితోనే ఆర్థికాభివృద్ధి

- సెర్ప్ కుట్టుశిక్షణ ప్రోగ్రామ్ మేనేజర్ రవీందర్‌రావు



శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

దేవరుప్పుల: మహిళల స్వయం సమృద్ధితోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని సెర్ప్ కుట్టు శిక్షణ తరగతుల కార్యనిర్వాహక మేనేజర్ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంతోపాటు కడవెండి, కోలుకొండ, సింగరాజుపల్లిలో కొనసాగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలు పొదుపు వరకే పరిమితం కాకుండా ఉత్పత్తి రంగాల వైపు దృష్టిసారిస్తే తీసుకున్న అప్పును సకాలంలో తీర్చడమే కాకుండా ఆశించిన లాభాలు పొందవచ్చని చెప్పారు. మానవ జీవన శైలిలో దుస్తులు అత్యంత అవసరమైనందున కుట్టు శిక్షణ నేర్చుకునే ప్రతి మహిళ ఉపాధి అవకాశాన్ని అందిపుచ్చుకోవచ్చన్నారు. ప్రభుత్వం కల్పించే ఉద్యోగ, ఉపాధితోపాటు వారి నైపుణ్యాన్నిబట్టి స్వతహాగా పనికల్పించుకుని ఎదగవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఓ వెంకట్‌రెడ్డి, సీసీ వసంత, ట్రెయినీలు గోలి రజిత తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు బ్రేక్..?

కాజీపేట అర్బన్: రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల ప్రక్రియకు బ్రేక్ పడినట్లు విశ్వసనీయ సమాచారం. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఇటీవల ప్రత్యేక కమిటీ లాంగ్ స్టాండింగ్ ఉద్యోగుల బదిలీలకు కసరత్తు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని లాంగ్ స్టాండింగ్ గ్రేడ్–1, గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్లు భద్రాద్రి కొత్తగూడానికి బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఈ ప్రక్రియను పూర్తి చేసిన ప్రత్యేక కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందించగా ప్రభుత్వం సైతం బదిలీలకు అనుమతిచ్చినట్లు సమాచారం. దీంతో పావులు కదిపిన ఉద్యోగ సంఘాల నాయకుల ప్రయత్నాలు ఫలించగా ఎన్నికల తర్వాత బదిలీల ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న అధికారులు హమ్మయ్య అంటూ ఊపిరిపీల్చుకున్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

జనగామ రూరల్: ఆర్టీసీ జనగామ డిపో పరిధి ప్రయాణికుల సమస్యలు పరిష్కరించడానికి ఆదివారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ప్రయాణికుల సందేహాలు, సూచనలను 99592 26050 నంబర్ ద్వారా తెలియజేయాలని డిపో మేనేజర్ వి.జ్యోత్స్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆత్మగౌరవానికి నిదర్శనం దశాబ్ది ఉత్సవాలు


- సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడాలి
- సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు వివరించాలి
- సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ప్రతి ఇంటిలో పండుగ వాతావరణం : ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



దశాబ్ది ఉత్సవాల లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, కలెక్టర్ శివలింగయ్య, అధికారులు

జనగామ: కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణలో నిర్వహించబోతున్న దశాబ్ది ఉత్సవాలు మన ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనంగా నిలువబోతున్నాయని రాష్ట్ర మంత్రి, మిషన్ భగీరథ చైర్మన్ ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై శనివారం కలెక్టర్ శివలింగయ్య అధ్యక్షతన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. తెలంగాణ రాకముందు.. వచ్చిన తర్వాత చేపట్టిన కార్యక్రమాలు దశాబ్ది ఉత్సవాల్లో హైలెట్ కావాలని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడాలని, ఈ వేడుకలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రత్యేక అధికారులను నియమించి ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. అన్ని రంగాల్లో జిల్లాను రాష్ట్ర మొదటి స్థానంలో నిలిపే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి ఇంటిలో దశాబ్ది ఉత్సవాలతో పండుగ వాతావరణం నెలకొంటుందని అన్నారు. ఏమీ లేని తెలంగాణలో రాష్ట్రం సిద్ధించిన తర్వాత సీఎం కేసీఆర్ మేధోశక్తితో సంపదను సృష్టిస్తూ పదేళ్ల కాలంలో దేశం మొత్తం చూసేలా చేశారని పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం రావడం మనందరి అదృష్టంగా భావించాలని అన్నారు. అంతకు ముందు ఉత్సవాల లోగోను మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు ఆవిష్కరించారు. సమీక్ష సమావేశంలో డీసీపీ పి.సీతారాం, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ వైస్ పర్సన్ పి.జమునలింగయ్య, డీసీసీబీ ఉమ్మడి జిల్లా చైర్మన్ ఎం.రవీందర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, డీఆర్డీఓ రాంరెడ్డి, ఆర్డీఓలు మధుమోహన్, కృష్ణవేణి, తహసీల్దార్లు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



జనగామ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్

జనగామ రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం మాటలతో మభ్యపెడుతోందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చేపడుతున్న నిరసన దీక్షకు మద్దతుగా శనివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు అధ్వర్యాన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగంపై సరైన దృక్పథం లేదని, ఎనిమిదేళ్లయినా ప్రమోషన్లు లేవని, ఐదేళ్లు దాటినా బదిలీలు చేయకపోవడం దారుణమన్నారు. వేతనాలు కూడా 10 నుంచి 15వ తేదీ దాటినా అందని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఈ కుబేర్‌లో పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, కేజీబీవీ, యూఆర్‌ఎస్, ఎస్‌ఎస్‌లో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు కనీస పే స్కేల్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్‌రావు, కోశాధికారి సుధాకర్, చిక్కుడు శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, కనకయ్య, నాగరాజు, నీలకంఠ, జంపయ్య, గోవర్ధన్ రెడ్డి, ఆగయ్య, ఉప్పలయ్య, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ క్యాంపస్‌గా నిట్ వరంగల్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్‌ను స్వచ్ఛ క్యాంపస్‌గా తీర్చిదిద్దుదామని డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. శనివారం నిట్ క్యాంపస్‌లో 'స్వచ్ఛ' ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. నెలలో చివరి శనివారం నిట్ క్యాంపస్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు. ఇందుకుగాను ఇనిస్టిట్యూట్ డెవలప్‌మెంట్ కమిటీ, వాలంటీర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యూ అకాడమిక్ బిల్డింగ్, ఫుడ్ స్ట్రీట్, ఫుడ్ కోర్టుల ప్రాంతాలను అధ్యాపకులు, విద్యార్థులతో ఆయన చెత్తను సేకరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఐఏకే.రెడ్డి, పీఈటీ ఆర్.దయానిధి, డీన్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛ్ క్యాంప్ ర్యాలీని ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

మనస్తాపంతో దివ్యాంగుడి ఆత్మహత్య


రాజు(ఫైల్)

సంగెం: పుట్టినప్పటి నుంచి కాళ్లు చచ్చుబడిపోవడంతో ప్రతి చిన్న అవసరానికి తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సి వస్తున్నదనే మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన దివ్యాంగుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాగితాల లక్ష్మి, ధర్మయ్యల చిన్న కుమారుడు రాజు(36) పుట్టుకతో రెండు కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని పరిస్థితి. మానసిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే. దీంతో కాలకృత్యాలతో పాటుగా ప్రతి పనికి తల్లిదండ్రులపైనే ఆధారపడుతుండేవాడు. ఈక్రమంలో తల్లిదండ్రుల సాయం లేనిదే ఏ పని చేసుకోలేకపోతున్నానని మధనపడుతుండేవా డు. తల్లిదండ్రులు ధైర్యం చెప్పినా తాను మాత్రం బాధ పడుతూనే ఉండేవాడు. ఈ నెల 26న తల్లిదండ్రులు ఓ ఫంక్షన్‌కు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజు జీవితంపై విరక్తితో గడ్డిమందు తాగాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. రాజు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ..

కామేపల్లి(కారేపల్లి): కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నెమలిపురికి చెందిన లకావత్ సుమలత(28)కు మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బీఆర్ఎస్ తండాకు చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉండగా, మూడు రోజుల క్రితం కుటుంబంలో గొడవలు జరగడంతో సుమలత నెమలిపురిలోని పుట్టింటికి వచ్చింది. అప్పటికే సునీత తల్లిదండ్రులు దైవ దర్శనం కోసం తిరుపతి వెళ్లారు. దీంతో తన పిల్లలను తీసుకురావాలని బంధువులను సునీత బీఆర్ఎస్ తండాకు పంపించగా పిల్లలను పంపేది లేదని భర్త చెప్పడంతో తిరిగొచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన సుమలత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

ఉన్నతవిద్యలో వర్సిటీల పాత్ర కీలకం

- న్యాక్‌పీర్ టీం చైర్మన్, మాజీ వీసీ సుగమ్‌ఆనంద్
- కేయూలో ముగిసిన న్యాక్ పీర్ టీం పర్యటన



నివేదికను వీసీ రమేష్‌కు అందజేస్తున్న న్యాక్‌టీం

కేయూ క్యాంపస్: ఉన్నతవిద్యలో విస్తృతమైన మార్పులు రాబోతున్నాయని, కావున విశ్వవిద్యాలయాల పాత్ర కీలకంగా ఉండాల్సిన అవసరం ఉందని నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ (న్యాక్) పీర్ టీం చైర్మన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలోని అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సుగమ్‌ఆనంద్ అన్నారు. న్యాక్ టీం చైర్మన్ సుమమ్ ఆనంద్‌తోపాటు మరో ఆరుగురు సభ్యుల బృందం మూడు రోజులుగా కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాలు, కళాశాలలు, హాస్టళ్లు, మెస్‌లు, హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. అకాడమిక్, పరిశోధన, ప్రాజెక్టులు, మౌలిక వసతులు ఎలా ఉన్నాయనే అంశాలపై అధ్యయనం చేశారు. శనివారం సాయంత్రం కేయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన ఎగ్జిట్ మీటింగ్‌లో సుగమ్ ఆనంద్ మాట్లాడారు. ఉన్నత విద్యలోనూ ప్రైవేటీకరణ పెద్ద ఎత్తున జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయాలు మనుగడ సాధించాలంటే మన సేవలను, బలాలను బహిరంగపర్చాలన్నారు. అనంతరం న్యాక్ టీం రూపొందించిన రిపోర్టును సీల్డ్ కవర్‌లో సుగమ్ ఆనంద్ కేయూ వీసీ తాటికొండ రమేష్‌కు అందించారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావు, ఐక్యూఏసీ డైరెక్టర్ నర్సింహాచారి పాల్గొన్నారు.

ఉపయోగపడే పరిశోధనలపై దృష్టిసారించాలి

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టిసారించాలని విభాగాల అధిపతులకు సూచించారు. శనివారం ఉదయం సెనెట్‌హాల్‌లో విభాగాల అధిపతుల సమావేశంలో విభాగాల వారీగా మీ పరిధిలో డిపార్టుమెంట్ల గురించి తెలియజేయాలని కోరగా పలువురు విభాగాల అధిపతులు తమ పరిశోధనలు, ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈసందర్భంగా న్యాక్‌బృందంలో ఓ సభ్యుడు మాట్లాడుతూ.. కొత్త అంశాలతో సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు చేయాలని సూచించారు. కాకతీయ యూనివర్సిటీలో 28 విభాగాలల్లో కేవలం 4వేల మంది వరకే విద్యార్థులున్నారని విద్యార్థుల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు.

న్యాక్ పీర్ టీంను కలిసిన చీఫ్ విప్

కాకతీయ యూనివర్సిటీలో గత మూడు రోజులుగా పర్యటిస్తున్న నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) పీర్ టీం చైర్మన్ సుగమ్ ఆనంద్, ఇతర సభ్యులను శనివారం కేయూలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. కాసేపు ఆ బృందంతో ముచ్చటించారు. కాకతీయ యూనివర్సిటీ విద్యాప్రమాణాలు, పరిశోధనల్లో ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందని యూనివర్సిటీ గురించి తెలియజేశారు. అనంతరం న్యాక్ పీర్‌టీం చైర్మన్ ఇతర సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీసీ రమేష్, బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, బాధ్యులు కొమురయ్య, యువజన నాయకులు డాక్టర్ వీరేందర్, లంక రాజగోపాల్, గొల్లపెల్లి వీరస్వామి, తిరుపతి, అనిల్, అరుణ్ ఉన్నారు.

తెలంగాణను దోచుకుంటున్న కేసీఆర్

- ప్రొఫెసర్ కోదండరాం


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కోదండరాం

హన్మకొండ చౌరస్తా: యువకుల ఆత్మబలిదానాలతో వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ తన కుటుంబం కోసం అక్రమ, ఆర్థిక సామ్రాజ్య విస్తరణ కోసం దోచుకుంటున్నాడని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. హనుమకొండలోని టీజేఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కోదండరామ్ మాట్లాడారు. తెలంగాణ వనరులను, కాంట్రాక్టులను సీమాంధ్ర కాంట్రాక్టర్లకు, కార్పొరేట్లకు అమ్ముకుంటున్న దళారీ పాలకులకు గోరీ కట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన లక్ష్యంగా ఏర్పడిన తెలంగాణ జనసమితి తెలంగాణ సమాజాన్ని మళ్లీ ఏకంచేసే దిశగా ప్లీనరీ నిర్వహిస్తున్నామని అన్నారు. జూన్ 4న ఉదయం 10గంటలకు సూర్యాపేటలో జరిగే టీజేఎస్ 3వ ప్లీనరీకి పెద్ద ఎత్తున హాజరు కావాలని ఉద్యమకారులకు పిలుపునిచ్చారు. అనంతరం టీజేఎస్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చిల్లా రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడిగా దేశబోయిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎదులాపురం తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా సాంబయ్య, కిరణ్, సాంబరాజు, మహేష్‌లు ఎన్నికైనట్లు రాజేంద్రప్రసాద్ తెలిపారు.

చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సి) గ్రామానికి చెందిన లాడె రాజబాబు (42) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన లాడె రాజబాబు శుక్రవారం రాత్రి తన వ్యవసాయ పనులను ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో సబ్ స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న ఓ వ్యక్తిని తప్పించబోయి వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయం కావడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మృతిని తండ్రి రాజీరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న ఎస్సై ఎండీ షాఖాన్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ జెడ్పీటీసీ దుర్మరణం

- మృతుడు మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి సోదరుడు


ప్రమాదంలో ధ్వంసమైన కారు


పురుషోత్తం రెడ్డి (ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి వద్ద వరంగల్–నర్సంపేట రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వేం పురుషోత్తంరెడ్డి(68) మృతి చెందారు. ఆయన మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డికి స్వయానా అన్న. పురుషోత్తంరెడ్డి భార్య, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని హంటర్‌రోడ్డులో ఉంటున్న వేం పురుషోత్తంరెడ్డి కేసముద్రం మండలంలోని తన స్వగ్రామం అర్పనపెల్లికి వెళ్లి తిరిగి వస్తున్నక్రమంలో మధ్యాహ్నం 2 గంటలకు గంగదేవిపల్లి వద్దకు రాగానే వరంగల్ వైపు వెళ్తున్న ఆయన కారును వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవింగ్ చేస్తున్న పురుషోత్తం రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సీటు బెల్టు పెట్టుకోలేదని తెలుస్తోంది. గీసుకొండ ఎస్సై శ్వేత సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ జంగిలి సదయ్య అజాగ్రత్తగా, అతి వేగంగా బస్సును నడపడంతో తన భర్త మృతి చెందాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. పురుషోత్తంరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా ఒకరు అమెరికాలో ఉంటున్నారు. మృతదేహానికి ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులు హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఇంటికి తరలించారు.

పలువురి పరామర్శ..

బాధిత కుటుంబ సభ్యులు, అతడి సోదరుడు మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డిని ములుగు, వరంగల్ తూర్పు ఎమ్మెల్యేలు సీతక్క, నన్నపనేని నరేందర్, కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, గీసుకొండ ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, పలువురు పరామర్శించారు.

రేవంత్ రెడ్డి సంతాపం.. నేడు రాక

వరంగల్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు వేం నరేందర్ రెడ్డి సోదరుడు కేసముద్రం మాజీ జెడ్పీటీసీ వేం పురుషోత్తంరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. ఇదిలా ఉండగా.. వేం పురుషోత్తంరెడ్డి కుటుంబ సభ్యులను రేవంత్ రెడ్డి ఆదివారం పరామర్శిస్తారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

అభివృద్ధి, సంక్షేమంలో నంబర్ వన్

- వచ్చే నెలలో మినీ టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

కొడకండ్ల: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఖ్యాతి గడించిందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం కొడకండ్ల, ఏడునూతులలో జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో ఎర్రబెల్లి ట్రస్ట్ చైరపర్సన్ ఉషాదయాకర్‌రావుతో కలిసి పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని వినూత్న ప్రజాసంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎడారిలాంటి ప్రాంతాల్లోనూ సాగునీటి పరవళ్లు తొక్కుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినా రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ మోటార్లకు మీటర్ల ఏర్పాటుకు అంగీకరించలేదని చెప్పారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో కాంగ్రెస్, బీజేపీలు ప్రగల్భాలు పలుకుతూ ప్రజల ముందుకొస్తున్నాయని, గడిచిన 50 ఏళ్లలో ఏం జరిగింది.. తెలంగాణ వచ్చాక కేసీఆర్ చేసిన అభివృద్ధిని విశ్లేసించుకోవాలని కోరారు. గెలిపించిన ఆదరించిన ప్రజల రుణాన్ని అభివృద్ధితో తీర్చుకుంటున్నానని చెప్పిన మంత్రి.. ఏడాదిలో ఇళ్లులేని వారు సొంత స్థలంలో నిర్మించుకోవడానికి మంజూరు చేయిస్తానని, నెలలోపు మిగిలిపోయిన వారికి ఫించన్‌లు మంజూరు చేస్తామని చెప్పారు. పద్మశాలీలు అధికంగా ఉన్నందున పట్టుబట్టి మినీ టెక్స్‌టైల్ పార్క్ మంజూరు చేయించానని, వచ్చే నెలలో శంకుస్థాపన చేయిస్తానని పేర్కొన్నారు. మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నానని వివరించారు. అనంతరం నర్సింగాపురంలో జీపీ భవన నిర్మాణం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్ రెడ్డి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వల్మిడికి విదేశీ వాణిజ్య సంబంధాలు

- చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి


చారిత్రక వస్తు సంపద


నాలుగు కాళ్ల రోలు


పురాతన వస్తువులతో రత్నాకర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా వల్మిడి గ్రామానికి విదేశీ వాణిజ్య సంబధాలున్నట్లు ఆధారాలు లభించాయని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం గ్రామంలో పర్యటించిన ఆయన తన పరిశోధన వివరాలను వెల్లడించారు. మూడు వేల సంవత్సరాల క్రితం వల్మిడి గుట్ట, మునులగుట్ట, పెద్దమ్మబండ కేంద్రంగా బృహద్ శిలాయుగం, శాతవాహనముల కాలం నాటి సంస్కృతి విలసిల్లినట్లు అనేక ఆధారాలున్నాయని చెప్పారు. రామాలయం ఉన్న గుట్ట నుంచి మంచుప్పులకు వెళ్లే దారికి రెండు వైపుల గుట్టల దిగువన విశాలమైన 'పాటి మీద'(దుబ్బ) అని పిలిచే ప్రాంతం ఉందని తెలిపారు. రాముని గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఎత్తైన రోడ్డు మార్గం వేయడానికి తీసిన కందకాల్లో, రోడ్డుకు ఇరువైపులా సాగు భూముల ఉపరితలంలో అనేక మృణ్మయపాత్రలు(మట్టి పాత్రలు) కనిపిస్తున్నాయన్నారు. జనగామ జిల్లాలోని అనేక గ్రామాల్లో శాతవాహనుల కాలం నాటి ఇటుకలు లభించాయని, వల్మిడి పాటి మీద కూడా పెద్దపెద్ద ఇటుకలు, గృహ అవసరాలు, అలంకరణకు ఉపయోగించే రౌలెటెడ్ వేర్ అని పిలుచుకునే రోమన్ పాత్రలు, పిల్లల చేతిలో ఇమిడే చిన్న మట్టి కుండలు, ఎరుపు, ముదురు ఎరుపు, నలుపు, బూడిద రంగులతో అనేక డిజైన్ల మట్టి పాత్రలు, ధాన్యం నిల్వకు ఉపయోగించే గాబులు, పసి పిల్లలకు పాలు తాగించే మట్టి పాత్రలు, నాణ్యత లోపించిన మట్టి పూసలు, చేతితో చేసి కాల్చిన ఎద్దు బొమ్మలు, ఒక ఫీటు కంటె పొడవైన నాలుగు కాళ్ల రాతి పీటలు, రాతి గోడ్డళ్లు, రాతి పనిముట్లు ఇక్కడ లభించాయన్నారు. గుట్టకు వెళ్లే తోవలో ఎడమ వైపు రోడ్డు నుంచి ఎర్రచెరువు మత్తడి వాగు, తునికాకు బండ వరకు చిట్టెపురాళ్లు, ఇనుప ముక్కలతో నేల ఉపరితలం కప్పి ఉందని, ఇనుము, ఉక్కు ముద్దలు చేయడానికి కమ్మరి కొలుములు ఉన్నట్లు కనిపిస్తున్నాయని వివరించారు. చరిత్ర పూర్వ యుగం నుంచే వల్మిడి గుట్టలో మానవ నాగరికత ప్రారంభమైనట్లు ఆనవాళ్లు ఉన్నాయని తెలుస్తోందన్నారు. విదేశీ వ్యాణిజ్యం చేసిన నిపుణులైన కమ్మరి, కుమ్మరులు ఇక్కడ ఉన్నట్లు ఆధారాలు చెబుతున్నాయన్నారు. శాతవాహనుల కాలంలో భూమార్గంలో సూర్యాపేట మీదుగా మచిలీపట్నం ఓడ రేవు చేరి అక్కడి నుంచి జలమార్గంలో రోమ్ సామ్రాజ్యంలో వాణిజ్య సంబంధాలు నెరిపినట్లు తెలంగాణలో చారిత్రక ఆదారాలు లభించాయన్నారు. వల్మిడిలో లభించిన రోమన్ పాత్రలు, ఇక్కడ తయారైన ఇనుము, ఉక్కు ముద్దలు ఇతర దేశాలకు ఎగుమతి అయినట్లు తెలుస్తున్నదని అన్నారు. వల్మిడిలో రాక్షస గూళ్ల సమాధులు, బౌద్ధ స్తూపాలకు ఉపయోగించే లైమ్ స్టోన్ రాతి ముక్క లభించినట్లు తెలిపారు.

వల్మిడి పూర్వపు పేరు గుల్మిడి

రామాయణం రాసిన వాల్మీకి పేరుతో వల్మిడి గ్రామంగా నామం స్థిర పడిందని స్థానికులు చెబుతున్నట్లుగా ఆధారాలు ఏమీ లభించలేదని రత్నాకర్‌రెడ్డి తెలిపారు. అయితే శాతవాహనుల కాలంలో ఐదు గ్రామాలను కలిపి నియమించే అధిపతిని గుల్మికుడు అంటారని, నాటి గుల్మిడి నేడు వల్మిడిగా ప్రసిద్ధి చెంది వుండవచ్చని అన్నారు.

వేర్వేరు చోట్ల నీటిలో మునిగి ముగ్గురి మృతి

నెక్కొండ: వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని గొల్లపల్లిలో ఓ బాలుడు కుంటలో పడి మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దపల్లి కిరణ్– కవితలకు కుమారుడు రాజేష్ (12), కుమార్తె ఉన్నారు. శుక్రవారం సాయంత్రం బాలుడు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో బాలుడి ఆచూకి కోసం వెళ్లగా గ్రామ శివారు కుంటలో రాత్రి శవమై తేలాడు. బాలుడు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందాడని భావిస్తున్నారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శవ పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై జానీపాష తెలిపారు.

మల్లన్న గండి రిజర్వాయర్‌లో..


శేఖర్ మృతదేహం

చిల్పూర్/ దేవరుప్పుల: జనగామ జిల్లా చిల్పూరు మండలం గార్లగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లన్న గండి రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు మునిగి శనివారం ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. దేవరుప్పుల మండలం ధర్మగడ్డ తండాకు చెందిన భూక్య శేఖర్(20) కిట్స్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం పరకాలకు చెందిన తోటి మిత్రులు కార్తీక్, విశ్వాస్‌లతో కలిసి మల్లగండికి చేరుకున్నారు. ఈక్రమంలో శేఖర్ నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునుగుతుండడంతో స్నేహితులు కాపాడమంటూ అరవడంతో చుట్టు పక్కల రైతులు చేరుకుని గాలించగా శవమై కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. మల్లన్నగండి రిజర్వాయర్‌లో మృతిచెందిన విద్యార్థి భూక్య శేఖర్ స్వగ్రామమైన ధర్మగడ్డతండా(దేవరుప్పుల)లో శనివారం విషాదం అలుముకుంది. ధర్మగడ్డతండాకు చెందిన భూక్య మేర్‌సింగ్ ఇరవై ఏండ్ల క్రితం కుటుంబంతో సహా హనుమకొండకు వెళ్లి ఆటో నడిపేవాడు. ఈ క్రమంలో మూడేళ్ల కిందట మేర్‌సింగ్ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో భార్య లక్ష్మీ కుమారుడు శేఖర్ చదువుకోసం ఇంటింటా కూలీ పనిచేస్తుంది. శుక్రవారం ఉదయం ధర్మగడ్డలో వారసత్వం భూమిని పెద్దమనుషుల సమక్షంలో చర్చించేందుకు వచ్చి, స్నేహితులతో కలిసి వెళ్లి నీటిలో మునిగి విగతజీవిగా మారాడు.

సమ్మక్క బ్యారేజీలో పడి యువకుడు..

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీలో చేపల వేటకు వెళ్లిన తూరం రామకృష్ణ నీటిలో మునిగి మృతిచెందాడు. రామకృష్ణ తండ్రి శ్రీను, ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాజన్నపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్దకు చేపల వేటకు వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో రామకృష్ణ కాలు జారి నీటిలో పడిపోయాడు. తోటి స్నేహితులు రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఎస్సై సురేష్ సహాయక చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. ఏటూరునాగారంలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

హౌస్ సర్జన్, పీజీ వైద్యుల స్టైఫండ్ పెంపు

ఎంజీఎం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యవిద్యలో భాగంగా విధులు నిర్వర్తించే హౌస్‌సర్జన్లు, పీజీ విద్యార్థులు, సీనియర్ రెసిడెన్స్ వైద్యుల స్టైఫండ్‌ను 15శాతం పెంచుతూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్సు	ప్రస్తుత స్టైఫండ్	పెంచిన స్టైఫండ్
హౌస్‌సర్జన్ మెడికల్	22,527	25,906
హౌస్‌సర్జన్ డెంటల్	22,527	25,906
పీజీ డిగ్రీ		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61528
మూడవ సంవత్సరం	56,319	64,767
పీజీ డిప్లొమా		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61,528
సూపర్ స్పెషాలిటీ		
మొదటి సంవత్సరం	80,500	92,575
రెండో సంవత్సరం	84,525	97,204
మూడో సంవత్సరం	88,547	10,11829
ఎండీఎస్		
మొదటి సంవత్సరం	50,686	58,289
రెండో సంవత్సరం	53,503	61,528
మూడో సంవత్సరం	56,319	64,767
సీనియర్ రెసిడెంట్స్	80,500	92,575

టీఎస్ ఐసెట్ ప్రశాంతం



ప్రవేశపరీక్షకు ప్రశ్నపత్రం సెట్‌ను ఎంపిక చేస్తున్న కేయూ వీసీ రమేష్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈవిద్యాసంవత్సరం (2023–2024) ప్రవేశాలకుగాను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన టీఎస్ ఐసెట్ వరంగల్ జిల్లాలోని 9 పరీక్ష కేంద్రాల్లో శనివారం ప్రశాంతంగా ముగిసింది. మొదటి సెషన్‌లో 2,100 మంది విద్యార్థులకు గాను 1,965మంది (93.6శాతం) హాజరయ్యారు. రెండో సెషన్‌లో 2,001 మందికిగాను 1,948మంది(92.8శాతం) మంది హాజరయ్యారని సెట్ కన్వీనర్, కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ వరలక్ష్మి తెలిపారు. నర్సంపేటలోని పరీక్షాకేంద్రంలో మొదటి సెషన్‌లో 153మందికి గాను 146మంది(95.4శాతం)హాజ రుకాగా.. రెండో సెషన్‌లో 152మందికిగాను 141మంది (92.8) శాతం హాజరైనట్లు వెల్లడించారు. కాగా, జూన్ 5న టీఎస్ ఐసెట్ ప్రిలిమినరీ కీ విడుదల చేసి, జూన్ 6నుంచి 8వ తేదీవరకు అభ్యంతరాలను స్వీకరించి, 20న ఫలితాలను వెల్లడించనున్నట్లు కన్వీనర్ వరలక్ష్మి పేర్కొన్నారు.

ప్రాణం తీసిన చేపలవేట


ప్రవీణ్ (ఫైల్)

గూడూరు: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఏపూరు గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపూరుకు చెందిన బానోతు ప్రవీణ్ (28) మురారి అనే వ్యక్తి కల్సి సమీప పాకాలవాగులో విద్యుత్ వైర్ అమర్చి చేపలు పట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వాగునీటిలో విద్యుత్ వైర్ పెట్టిన విషయం మరిచారు. చేపల కోసం వెళ్లిన ఇద్దరిలో ప్రవీణ్ నీటిలోకి దిగాడు. ఆ సమయంలో విద్యుదాఘాతం సంభవించి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనను గుర్తించిన మురారి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెల్సుకున్న ఎస్సై దిలీప్ సిబ్బందితో అక్కడికి చేరుకొని సంఘటన జరిగిన తీరుపై ఆరా తీశారు. శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సోనుతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.